



తాడిపత్రి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం

ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

వివరాలు మెయిన్‌లో...

ముంచెత్తిన వాన

- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- చెరువులకు జలకళ
- ఇళ్లు, కార్యాలయాల్లోకి చేరిన వర్షం నీరు
- ఇబ్బందులు పడ్డ ప్రజలు
- ఆయా ప్రాంతాల్లో స్థానిక నాయకుల సహాయక చర్యలు



అనంతపురంలో జిల్లాలో మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా జోరువర్షం కురవడంతో కుంటలు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు నిండాయి. పామిడి, గుత్తి, రాయదుర్గం, బొమ్మనహాల్, కణేకల్, అనంతపురం తదితర ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. గుత్తిలో ప్రభుత్వ కార్యాలయాల్లోని నీరు చేరింది. అనంతపురంలో నడిమివంకలో ఆక్రమణల వల్ల నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో ఎమ్మెల్యే, మేయర్ తదితరులు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గుత్తి, రాయదుర్గం, బొమ్మనహాల్ తదితర ప్రాంతాల్లో పలు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆయాప్రాంతాలకు చెందిన నాయకులు సహాయక చర్యలు చేపట్టారు.

ప్రజాశక్తి యంత్రాంగం



పామిడి - కల్లూరు రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు



అనంతపురంలోని వర్షపు ముంపు కాలనీల్లోకి పర్యటిస్తున్న మేయర్

ప్రజాశక్తి - పామిడి

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పట్టణంలో మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలైన చైతన్య కాలనీ, నాయి బ్రాహ్మణ కాలనీ, వెంగమ నాయుడు కాలనీ, అంబా భవాని గుడి ఏరియా, కొండాపురం రైల్వే గేట్ పరిసర ప్రాంతాలు,ఎద్దులపల్లి రోడ్డు రైల్వే గేట్ సమీపంలోని కాలనీ, సరస్వతి విద్యా మందిరం, జూనియర్ కాలేజీ తదితర ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విషయం తెలుసుకున్న పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, పంచాయతీ సెక్రెటరీ చంద్రశేఖర్, కత్రిమల ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాస్ రెడ్డి, ఆర్ఆర్. రమేష్, పంచాయతీ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఎక్కడైతే నీరు వెళ్లడానికి ఇబ్బంది తలెత్తుందో ఆ ప్రాంతాల్లో జెసిబిలు, హిటాచీ సాయంతో నీరు వెళ్లే దారిలో ఉన్న చెత్త తొలగించే చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు ఇళ్లలో చేరి వంట చేసుకోవడానికి ఇబ్బంది పడిన ప్రజలకు టిడిపి నాయకుడు ఆర్ఆర్. రమేష్ అల్పాహారం అందించారు. పెన్నా నదిలో వరద నీరు రోడ్డు మీద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పామిడి కల్లూరు రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నీలూరు, తంబళ్లపల్లి గ్రామాల మధ్య ఉన్న వంతెన కూలిపోయి వర్షపు నీరు భారీగా రోడ్డుమీదకు వచ్చింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు తంబళ్లపల్లి వంతెనను పరిశీలించి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆయా కార్యక్రమాల్లో కరూరు శివ, నిమ్మకాయల శీన, పసల శివ, పురుషోత్తం, మంజునాథ్, ఓబులేసు యాదవ్, గోవిందు, తిరుపాలు, వెంకటేష్, అజిత్, బాలచంద్ర, రాజు, డేవిడ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : మంగళవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా అనంతపురం నగరంలోని రజక నగర్ లోకి వర్షం నీరు చేరింది. దీంతో బుధవారం నగర మేయర్ మహ్మద్ వసీం ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. రజక నగర్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడిమి వంకకు రక్షణ కూడా ఏర్పాటు చేయడానికి నగరపాలక ఆధ్వర్యంలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం నగరంలో చాలా ప్రాంతాల్లో కాల్వలపై ఆక్రమణల వలన చిన్నపాటి వర్షాలకే ఇబ్బందులు తలెత్తున్నాయని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం వలన కొన్ని కాలనీల్లో ఇళ్లలోకి నీరు వచ్చిన నేపథ్యంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. నగరంలోని 48వ డివిజన్ లోని సోమనాథ్ నగర్ తో పాటు పలు కాలనీల్లో పర్యటించారు. డ్రైనేజీల నుంచి నీరు పొంగి పొర్లి ఇళ్లలోకి నీరు చేరి కాలనీ వాసులు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. రోడ్లపై బురద, మురుగు పేరుకపోవడంతో వెంటనే క్లీనింగ్ చేపట్టాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. వంకలపై ఇష్టానుసారంగా ఆక్రమణలు కనిపిస్తున్నాయని కొన్ని చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉందని అన్నారు. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. వర్షాల నేపథ్యంలో మున్సిపల్ సిబ్బందిని ఇతర విభాగాల్ని అప్రమత్తం చేశామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

బొమ్మనహాల్ : మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వంకలు, వాగులు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని ఉద్దేహాల్, బొమ్మనహాల్, గోవిందవాడ, బొల్లనగుడ్డం తదితర ప్రాంతాల్లోని కాలనీలు జలమయమయ్యాయి. గహాల్లోకి వర్షపు నీరు చేరడయంతో బియ్యం, దుస్తులు తడిసిపోయాయని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోయారు.

రాయదుర్గం : మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రాయదుర్గం పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రామస్వామి వీధి, దుగ్గిలమ్మ గుడి వీధి, మధు టాకీస్ ఏరియా, కొలిమి బజార్, కృష్ణాశ్రమం, ప్రభుత్వ ఆసుపత్రి పక్క వీధి తదితర ప్రాంతాలు నీట మునిగాయి. అనంతపురం ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచాయి. పలు ఇల్లు, దుకాణాలలోకి నీరు చేరాయి. ఆహార ధాన్యాలు, గార్మెంట్ ఉత్పత్తులు, ఇతర నిత్యావసరాలు వాన నీటి ముంపుతో తడిచి నష్టం వాటిల్లింది. బుధవారం రాయదుర్గంలో 85.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. రాయ దుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు తనయుడు కాలువ భరత్, మాజీ వైస్ చైర్మన్ వెంకటేశులు టిడిపి అధికార ప్రతినిధి పురుషోత్తం తదితరులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.



గుత్తిలో ఇంటిలోకి చేరిన వర్షపునీరు



రాయదుర్గంలో నివాసప్రాంతాల్లో ప్రవహిస్తున్న వర్షపునీరు

గుత్తి : మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వివిధ గ్రామాలు, పట్టణంలోని పలు కాలనీల్లోని నివాసాల్లోకి వర్షపు నీరు చేరింది. లోతట్టు ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు జలమయమయ్యాయి. 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయం, మండల వ్యవసాయ అధికారి కార్యాలయం, ఐసిడిఎస్, వెలుగు, అటవీ శాఖ, సబ్ రిజిస్ట్రార్, పురపాలక సంఘ కార్యాలయాలతో పాటు సిపిఎం కార్యాలయం, ప్రభుత్వ బాలుర వసతిగృహం నీట మునిగాయి. కార్యాలయాల్లో కొంత సమయం కార్యకలాపాలు స్తంభించిపోయాయి. జెడ్. వీరారెడ్డి కాలనీ, న్యూ సిపిఐ కాలనీ, గౌతమపురి కాలనీ, గుత్తి ఆర్ఎస్ లోని పలు వీధుల్లోని నివాస గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. హోటళ్లు, దుకాణాలు జలమయమయ్యాయి. లచ్చానుపల్లి, శ్రీపురం, రజాపురం, బసినేపల్లి గ్రామాల వద్ద ఉన్న వంకల్లో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

గుప్త నిధుల దోపిడీ ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - రాయదుర్గం



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, తదితరులు

గుప్తనిధుల దోపిడీకి పాల్పడే ముఠాను అరెస్టు చేసినట్లు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. ముఠా అరెస్టు వివరాలను బుధవారం రాయదుర్గంలో పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. రాయదుర్గం సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ ఎస్ఎండి.వలి తమ సిబ్బందితో కలసి రాయదుర్గం పట్టణ పొలిమేరలో బళ్ళారి రోడ్డు కుంటి మారెమ్మ ఆలయం వద్ద మంగళవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. రాయదుర్గం నుండి బళ్ళారి వైపు వెళుతున్న ఒక కారులో ఆరుగురు వ్యక్తులు అనునాస్పద స్థితిలో వెళుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు కారును సోదా చేశారు. కార్డు డిక్కీలో వంట గ్యాస్ సిలిండర్, ఒక ఆక్సిజన్ సిలిండర్, గ్యాస్ కట్టర్, ఇనుప గునపాలు, సుత్తులు, ఇనుప ఉలి కన్పించాయి. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుంటుండగా ఆరుగురులో ముగ్గురు పరారర్యారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆరుగురు ముఠాగా ఏర్పడి ఆలయాలలో గుప్తనిధులు తీయడానికి వెళుతున్నట్లు నిందితులు అంగీకరించారు. ఈ ముఠాలో రాయదుర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బుధవారం పట్టణంలోని వైయస్సార్ సర్కిల్ వద్ద పట్టుబడ్డారు. మొత్తం ఈ ముఠాకు సంబంధించి ఐదుగురు పట్టుపడగా వారిలో ఇద్దరు రాయదుర్గానికి చెందినవారు, మరో ఇద్దరు పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామానికి చెందిన వారు, మరొకరు శింగనమల మండలం నాగులగుడ్డం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిగా పోలీసులు నిర్ధారించారు. నిందితుల నుండి దోపిడీకి ఉపయోగించిన గ్యాస్ సిలిండర్లు, ఇనుప గునపాలు సుత్తులు, ఉలి ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకొని వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు కర్నాటక రాష్ట్ర సరిహద్దుల్లో మారుమూలన ఉన్న పురాతన ఆలయాలను గుర్తించి అక్కడ గుప్తనిధుల కోసం త్రవ్వకాలకు పాల్పడు తున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన సిఐ శ్రీనివాసులు, ఎస్ వలికి ప్రశంసా పత్రాలు ఇచ్చేందుకు ఎస్పీకి సిఫార్సు చేసినట్లు ఈసందర్భంగా డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో రాయదుర్గం సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ మహమ్మద్ వలి తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని టమోటా రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.పోతులయ్య, రాప్తాడు చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మకు ఎపి రైతుసంఘం నాయకులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో సుమారు 23 వేల హెక్టార్లలో రైతులు టమోటా పంట సాగు చేశారన్నారు. వారందరూ మార్కెట్ సౌకర్యం లేక ప్రయివేట్ మార్కెట్లతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా అనంతపురం కక్కలపల్లి వద్ద 28 టమోటా ప్రయివేట్ మార్కెట్లలో యజమానులు, వ్యాపారులు, లారీ అసోసియేషన్ యాజమాన్యాల మధ్య విభేదాలు రావడంతో సమస్య తీవ్రమైందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వమే టమోటా మార్కెట్‌ను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రస్తుతం మార్కెట్‌లో రూ.వందకు 10 శాతం కమీషన్ తీసుకోకుండా రూ.4 తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, ఒకసారి వేలం వేసి ధర నిర్ణయించిన తర్వాత ధర తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని, జిల్లాలో టమోటాకు అనుబంధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, టమోటా మార్కెట్‌లో రైతులకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

దేశంలో మహిళలకు రక్షణ కరువు

జూనియర్ డాక్టర్ హంతకులను శిక్షించాలి -సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు -నగరంలో కొవ్వొత్తు ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

దేశంలో మహిళలకు రక్షణ కరువైందని, కోల్‌కత్తాలో వైద్యురాలి హత్యే ఇందుకు ఉదాహరణ అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమై ర్యాలీ తెలుగుతల్లి కూడలి మీదుగా పెద్దాసుపత్రి వరకూ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న డాక్టర్‌పై దుండగులు అత్యాచారం చేసి హత్య చేయడం సమాజానికి సిగ్గుచేటు అన్నారు. ప్రాణాలు కాపాడే డాక్టర్లకే దేశంలో రక్షణ కరువైందన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని దేశంలో ఎక్కడో ఒకచోట మహిళలు బాధింపబడటంతోపాటు అత్యాచారాలు, హత్యలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి దురాగతాలను అరికట్టాల్సిన బాధ్యత కేంద్రంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. కలకత్తాలో వైద్యురాలి అత్యాచారం హత్య జరిగితే ఆత్మహత్య అంటూ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ తప్పుడు వాంగ్మూలం చెప్పడం దారుణమన్నారు. కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడానికమా రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడం దుర్మార్గమన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడికి కఠినంగా శిక్షించాలని, అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృడం కాకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా కోశాధికారి టి.గోపాల్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకట్‌నారాయణ, జిల్లా నాయకులు మన్నీల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జూడాల దీక్షకు మద్దతు

అనంతపురం అర్బన్ : కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు డిమాండ్ చేశారు. వైద్యురాలి హత్యను నిరసిస్తూ అనంతపురం సర్వజన ప్రభుత్వాసుత్రిలో జూనియర్ డాక్టర్లు చేపట్టిన దీక్షకు సిఐటియు నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ రక్షించే వైద్యులకే రక్షణ కరువైందన్నారు. పవిత్ర వృత్తిలో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేయడమే కాకుండా హత్య చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇలాంటి వారిని బహిరంగంగా ఉరి తీయాలని, లేదంటే ఎన్ కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వైద్యులు, వైద్యరంగంలోని వారికి రక్షణ లేకుండాపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వై.వెంకట్ నారాయణ, తిరుమలేశు, శివారెడ్డి, ఆదినారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

'అన్న క్యాంటీన్, రాజధాని'కి సహకారం అందించాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో నూతనంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లతోపాటు రాష్ట్ర రాజధాని అమరావతికి ప్రతి ఒక్కరూ తమ సహాయ, సహకారాలు అందించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. అనంతపురానికి చెందిన దత్త శిల్క్స్ అధినేత దత్త శివ నగరంలోని అన్నక్యాంటీన్‌కు బుధవారం రూ.లక్ష విరాళం చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. విరాళం అందించిన దత్త శివను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉందన్నారు. అయినప్పటికీ చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. ఇలాంటి సమయంలో అన్న క్యాంటీన్లు, అమరావతి నిర్మాణానికి సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు.

జెఎన్‌టియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై సమీక్ష



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శన్‌రావు

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం నుంచి 28 తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ హెచ్.సుదర్శన్‌రావు తెలిపారు. బుధవారం వర్సిటీలోని ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్‌లో డైరెక్టర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఓటిపిఆర్ఐ డైరెక్టర్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి, కోఆర్డినేటర్లుతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఓఎస్‌డి ఎన్.దేవన్న, డైరెక్టర్లు ఎస్‌వి.సత్యనారాయణ, పి.ఆర్.భానుమూర్తి, పరీక్షల విభాగం డైరెక్టర్ నాగప్రసాద్ నాయుడు, ఓటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, బి.ఈశ్వర్‌రెడ్డి, జివి.సుబ్బారెడ్డి, ఎన్.విశాలి, వైశాలి ఘోర్పడే, ఆర్.కిరణ్మయి, పి.సుజాత, ప్రశాంతి, ఎ.సురేష్‌బాబు, ఎపి.శివకుమార్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి టి.నారాయణరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్పీగా డివి.రమణమూర్తి



అనంతపురం క్రైం : జిల్లా అదనపు ఎస్పీగా డి.వి.రమణమూర్తి బుధవారం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లాకు చెందిన డి.వి.రమణమూర్తి 1989లో ఎస్ఐగా పోలీసుశాఖలో చేరారు. తర్వాత సి.ఐగా, డీఎస్పీగా పదోన్నతి పోందారు. అప్పా, కర్నూలు స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా పనిచేశారు. అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది అనంతపురం పిటిసి, అక్కడి నుంచి సాధారణ బదిలీలలో భాగంగా జిల్లా పోలీసుశాఖ అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు.

మైనారిటీ గురుకుల పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు తరిమెల గిరి మాట్లాడుతూ మైనారిటీ గురుకుల పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో తాగడానికి తాగునీరు లేదన్నారు. అలాగే తరగతి గదులు లేవన్నారు. ఫలితంగా ఒకేగదిలో తినడం, తరగతులు బోధించడం, పడుకుంటూ కాలం వెల్లదీస్తున్నారన్నారు. ఇక మరుగుదొడ్లు లేక కాలకృత్యాలు తీర్చుకునేందుకు బహిరంగ ప్రదేశాలకు వెళ్తున్నారన్నారు. వంటగది, డైనింగ్ హాల్ వసతులు లేవన్నారు.. పేద, మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రులు తినడానికి తిండి లేని పరిస్థితుల్లో విద్యార్థుల్ని మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మైనారిటీ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఇర్ఫాన్, రిజ్వాన్, మహమ్మద్, యూసుఫ్, ఖాదీర్‌బాషా, ముస్తఫ్ అలీ, రాజు, విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఫ్రీహోల్డ్' భూములపై పున:పరిశీలన చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో జీవో ఎంఎస్ నెం.596 ప్రకారం 22ఏ నుంచి ఫ్రీహోల్డ్ అయిన భూములపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ సమన్వయంతో పున్ణపరిశీలన చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 108.309 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్లు జరిగాయని, వాటిపై నిబంధనల ప్రకారం రీవెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలన్నారు. భూములకు సంబంధించి సర్వే నెంబర్ వారీగా ఈ ఆఫీస్ ఫైల్ పెట్టాలన్నారు. భూ సమస్యలపై జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఖచ్చితమైన దిశలోనే ముందుకెళ్లేలా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా జిల్లాలోని బొమ్మనహాల్, కుందుర్పి, కంబదూరు, డి.హీరేహాల్ మండలాల పరిధిలో ఎక్కువ భూ సమస్యలు వస్తున్నాయని, వాటి పరిష్కారంపై అధికారులు దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, ఆర్డీవోలు శ్రీనివాసులురెడ్డి, రాణిసుస్మిత, నగరపాలక సంస్థ కమిషనర్ పీవీఎస్ఎన్ మూర్తి, సర్వే ఎడి రూప్లానాయక్, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఏవో జి.మారుతి, ఆర్డీవో కార్యాలయం డీఏవో విజయలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్లు, తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

ప్రజాశక్తి-శింగనమల



మాట్లాడుతున్న ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు

అధిక నష్టాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఎపి రైతుసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చిన్నమట్లగొంది శ్రీనివాసులు, కార్యదర్శిగా ఇరువెందుల కొండారెడ్డి, మండల ఉపాధ్యక్షులుగా ఉల్లికల్లు ఓబిరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఉల్లికల్లు రమేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కోసం ఎపి రైతుసంఘం నిరంతరం పోరాడుతుందన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం అధిక వర్షాల మండలవ్యాప్తంగా చాలామంది రైతులు పంటలు నష్టపోయారన్నారు. వారందరికీ పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సబ్సిడీ, పంట నష్టపరిహారం అందించాలని కోరుతూ మండల కేంద్రంలో వచ్చేనెల 2న తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబిరెడ్డి, వెంకటస్వామి, శ్రీనివాసులు, పుల్లన్న, రుషింగప్ప, బాలరాజు, వెంకటస్వామి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తెగుళ్ల నుంచి పంటలను రక్షించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మహేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఆగస్టులో ప్రతి మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. మండలంలో ఆముదం 732 (హెక్టార్లలో), వేరుశనగ 9275, కంది 1552, మొక్కజొన్న 368 హెక్టార్లలో సాగు చేసినట్లు తెలిపారు. ఈనేపథ్యంలో అధిక వర్షాలకు పొలాల్లో అక్కడక్కడ నీరు నిలబడటం వల్ల ఆముదం, మొక్కజొన్న, వేరుశనగ, పత్తి పంటల్లో వేరు వ్యవస్థకు గాలి సోకక నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. కావున ఎకరాకు 200 లీటర్ల నీటికి 4 కిలోల యూరియా లేదా 200 లీటర్ల నీటికి కిలో చొప్పున పొటాషియం నైట్రేట్‌ను వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేస్తే మొక్కలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. కావున మురుగు నీటిని కూడా అక్కడ నుండి చిన్న కాలువల ద్వారా తొలగించాలని కోరారు. ఇకపోతే వర్షాలకు నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి నష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదికలను పంపనున్నట్లు తెలిపారు.

'సైబర్ సెక్యూరిటీ'పై అవగాహన

శింగనమల : మండల పరిధిలోని రోటరీపురం గ్రామం సమీపంలో ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు సైబర్ సెక్యూరిటీ అంశంపై మూడు రోజుల పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల అనుబంధంగా ఎన్‌సిఎస్‌టిసి వారు కాల్డ్ అండ్ సపోర్టెడ్ బై ది నేషనల్ కౌమిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటర్నెట్ వాడకం, సైబర్ సెక్యూరిటీ మంచీచెడు, ఉపయోగాలు, ఇతర ఇబ్బందులు, ఇంటర్నెట్ వాడకం, సోషల్ మీడియా అకౌంట్స్ ఉపయోగించడం ఎలా, డిజిటల్ లావాదేవీలు, మన గుర్తింపును ఎలా రక్షించుకోవాలి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ వెంకట నాగజయుడు, కంప్యూటర్స్ విభాగాధిపతి జి.హేమంత్ కుమార్‌యాదవ్, శశికళ, సునీత, చిన్న పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

గుత్తి : మండలంలోని లచ్చానుపల్లి గ్రామంలో బుధవారం వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు ఏపీ వాల్మీకి, బోయ సంఘం ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు మండపం నిర్మాణానికి నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎపి వాల్మీకి బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లెల్లి కృష్ణయ్య, నాయకులు కొనకొండ్ల సూరి, కె.శ్రీధర్, తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

బ్రహ్మసముద్రం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రిడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మీకు తెలుసా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి (ఎయిడ్స్) వ్యాధి ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, హెచ్.ఐ.వి(ఎయిడ్స్) రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రిడ్స్ పోగ్రాం మేనేజర్ మహేష్, రిడ్స్ కల్యాణదుర్గం ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, పిఇటి కిరణ్‌కుమార్, రిడ్స్ సిబ్బంది చంద్రశేఖర్, నాగరాజు, మారెక్క, లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

27న సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాడిపత్రి రూరల్ : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించిన సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎవి రంగారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జూనియర్ డాక్టర్ హత్య కేసు నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం



రాయదర్గంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు, మున్సిపల్ వర్కర్లు, విద్యార్థులతో కలిసి నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రభుత్వ వైద్యశాల వరకూ కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మాట్లాడుతూ దుండగులకు శిక్ష పడే వరకూ ఆమె కుటుంబానికి అండగా ఉంటూ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శివ, దేవరాజ్, వంశీ, బాషా, వలి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మేరీ రాధమ్మ, ఆశావర్కర్ల యూనియన్ నాయకులు లక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, కార్మికులు విద్యార్థులు, సిపిఎం నాయకులు తిమ్మరాజు, మధు, అంజి, నాగరాజు, శంకర్, ఓబులేష్, అంజి, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : కోల్‌కత్తాలో డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని ఏపీ హంస యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డాక్టర్ హత్యను నిరసిస్తూ అనంతపురంలో డాక్టర్లు చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు ఎపి హంస యూనియన్ నాయకులు బుధవారం మద్దతు ప్రకటించారు. మద్దతు ప్రకటించిన వారిలో ఎపి హంస జిల్లా కన్వీనర్ ఎస్ఎండి.షఫీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేపల్లి పామన్న, జిల్లా కన్వీనర్ కోకిల చాముండేశ్వరి, సంపూర్ణ, యూనియన్ నాయకులు కుళ్లాయిబాబు, లోకేశ్వర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, భక్తుర్ అలీఖాన్, యల్లప్ప, సుబ్రమణ్యం, రాజు, తిప్పే రుద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ'లో సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఆందోళనలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

బుక్కరాయసముద్రం మండలంలోని వడియంపేట వద్ద ఉన్న నారాయణ మహిళా జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నారాయణ కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలరోజుల నుంచి నారాయణ కళాశాలలో కనీసం నీళ్లు లేకున్నా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా విద్యార్థుల సమస్యలపై శ్రద్ధ వహించకుంటే ఎలా అని నిలదీశారు. దీనికితోడు రాత్రి సమయంలో కరెంటు కూడా తీసేస్తున్నారని వాపోయారు. విద్యార్థినులు తమ తల్లిదండ్రులకు ఫోన్ చేయాలన్నా సౌకర్యం లేదన్నారు. కళాశాలలో ఉన్న ల్యాండ్‌లైన్ ఫోన్లను కూడా కట్ చేశారని వాపోయారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఆర్ఐఒ స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గిరి, భీమేష్, ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు మంజునాథ్, ఉమా మహేష్, నాయకులు తారక్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్



పామిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పామిడి : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దేశవ్యాప్తంగా చేపట్టిన భారత బంద్ పిలుపులో భాగంగా బుధవారం పామిడిలో బంద్ పాటించారు. ఇందులో భాగంగా మాల మహానాడు, ఎపి ఎరుకుల ప్రజాపోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బొడ్రాయి, మెయిన్ బజార్, ఎద్దులపల్లి సర్కిల్, బీసీసీ రోడ్డు తదితర ప్రాంతాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, దుకాణాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కెవి.చలపతి, ఎపి ఏరుకుల ప్రజా పోరాట సమితి అధ్యక్షులు సాకే గోవింద్, మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు, ఆంజనేయులు, రమేష్, ఓబులేసు, ప్రచండ, వెంకటేశులు, సుందర్‌రాజు, చంద్ర, శివ, పవన్, మనోహర్, నాగరాజు, విజయ్, సురేష్, నరసింహులు, పవన్, నందు, నారాయణస్వామి, రాజ్‌కుమార్, రాము, అశోక్, ఉపేంద్ర, వంశీ, అజయ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : భారత్ బంద్‌లో భాగంగా పట్టణంలో మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. అక్కడ నుంచి గాంధీచౌక్ వరకూ ర్యాలీ నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఎం.రామాంజనేయులు, నాయకులు చిన్న వెంకటేశులు, బేల్దారి చంద్ర, ఆది, గోవిందు, రంగనాయకులు, న్యాయవాది సాలప్ప తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఎస్సీ వర్గీకరణ ముమ్మాటికి రాజ్యాంగ విరుద్ధమే అని మాల మహానాడు నాయకులు ఎర్రిస్వామి, మల్లయ్య, లక్ష్మీపతి వాపోయారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టీ సర్కిల్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి, ఆర్‌డిఒ రాణిసుష్మితకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, వినోద్‌కుమార్, ఈశ్వర్, ప్రసాద్, కొల్లాపూరప్ప, ఉమేష్, తిమ్మరాజు, తిప్పేస్వామి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

చిన్నపేగుల్లో 'గ్యాంగ్రిన్'

కిమ్స్ సవీరాలో అరుదైన చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న సవీరా వైద్యులు మహమ్మద్ షాహిద్

ప్రజాశక్తి-అనంతపురం

అత్యంత అరుదైన, ప్రాణాంతకమైన మెసెంటెరిక్ ఇష్కెమియా అనే వ్యాధి ఉన్న వ్యక్తికి అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రిలో అత్యవసర శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. కిమ్స్ సవీరా ఆసుపత్రికి చెందిన కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఎన్.మహమ్మద్ షాహిద్ వివరాలు తెలిపిన వివరాల మేరకు... సరైన సమయానికి శస్త్రచికిత్స చేయకపోతే దీనివల్ల గుండెపోటు, స్ట్రోక్ లాంటివి సంభవించి, ప్రాణాపాయం కూడా పొంచి ఉండేది. తీవ్రమైన కడుపునొప్పితో ఏడురోజులుగా బాధపడుతున్న 45 ఏళ్ల వ్యక్తి చికిత్స కోసం పలు ఆస్పత్రులు తిరిగినా ఏమాత్రం ఊరట లభించలేదు. తర్వాత కిమ్స్ సవీరా ఆసుపత్రికి రాగా.. అక్కడ సీఈసీటీ స్కాన్ చేస్తే పేగుల్లో తీవ్రమైన అడ్డంకి ఉందని.. బహూశా గ్యాంగ్రిన్ కావచ్చని తేలింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఆసుపత్రిలోని కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ మహ్మద్ షహీద్ అత్యవసరంగా శస్త్రచికిత్స చేశారు. ఇందులో దాదాపు 300 సెంటీమీటర్ల మేర చిన్నపేగుకు గ్యాంగ్రిన్ సోకింది. దీనికి కారణం మెసెంటెరిక్ ఇష్కెమియా, అంటే రక్తం సరఫరా కాకపోవడం. గ్యాంగ్రిన్ బారిన పడిన పేగును తీసేసి, మిగిలిన పేగును కలిపి కుట్టేశారు. శస్త్రచికిత్స అనంతరం రోగి వారం రోజుల్లో పూర్తిగా కోలుకుని, ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో అతడిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు.

ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీస్ డైరెక్టర్‌గా భానుమూర్తి

అనంతపురం : జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు ఆదేశాల మేరకు ఇండస్ట్రియల్ కన్సల్టెన్సీ సర్వీస్ డైరెక్టర్‌గా పిఆర్.భానుమూర్తి, ఇండస్ట్రియల్ రిలేషన్స్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్‌గా ఎస్.విశాలి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డైరెక్టర్లు, బోధన, బోధనేతర సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వారికి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పిహెచ్‌డికి దరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం : స్థానిక జెఎన్‌టియులో ఇండస్ట్రియల్ పిహెచ్‌డి చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ఆర్.కిరణ్మయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈక్రాప్ బుకింగ్ పరిశీలన

అనంతపురం : అనంతపురం రూరల్ మండలం ఇటుకులపల్లి ఆర్ఎస్‌కె పరిధిలో చేపట్టిన ఈ-పంట నమోదును మండల వ్యవసాయ అధికారిణి జె.శశికళ బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి బి.మురళీకృష్ణ, గ్రామ వ్యవసాయ సహాయకులు హేమ, పావని, రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

యల్లనూరు : ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బుధవారం మండలానికి రానున్నట్లు టిడిపి నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా గండికోట రిజర్వాయర్ నుంచి ఎత్తిపోతల పంపుద్వారా యల్లనూరు చెరువుకు, గడ్డంవారిపల్లి చెరువుకు నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

డ్రెయినేజీలు శుభ్రం

కళ్యాణదుర్గం : భారీ వర్షాల కారణంగా మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లు, ఒంటిమిద్ది, రాజప్పకుంట వీధుల్లో మూసుకుపోయిన డ్రెయినేజీలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాలతో జెసిబిల ద్వారా బుధవారం శుభ్రం చేయించారు. భారీ వర్షాల కారణంగా అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలని సూచించారు.

ఈక్రాప్ బుకింగ్ తప్పనిసరి

బ్రహ్మసముద్రం : మండలంలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని కళ్యాణదుర్గం ఉద్యానవన అధికారి కృష్ణతేజ సూచించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్ఎస్‌కె సిబ్బందితో ఈక్రాప్ బుకింగ్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యాన రైతు వారు సాగు చేసిన పంటను ఈ-పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా

రాయదుర్గం : జాతీయ పశువ్యాధి నివారణ పథకంలో భాగంగా మండలంలోని రేకలకుంట, అవులదట్ల, కదరంపల్లి, నాగిరెడ్డిపల్లి, వేపరాళ్ల, 74 ఉడేగోళం గ్రామాల్లో సుమారు 1270 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యశాల వైద్యాధికారి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో శివారెడ్డి, రేకులకుంట సర్పంచి ఎర్రిస్వామిరెడ్డి, పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని పాలవెంకటాపురం, కన్నేపల్లి, ఎరడికెర గ్రామాల్లో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు గోవిందరాజులు, లింగన్న, సుధీర్‌కుమార్, గీత, రమణానాయక్, భానుప్రియ, మంజుల, సుధ, జలీల్, పాడి రైతులు పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం : జిల్లా సాధారణ పరీక్ష మండలి అకడమిక్ క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పరీక్షల విభాగం ఏసీ గోవిందనాయక్, ఎడి కృష్ణయ్య, డిసిఇబి కార్యదర్శి పురుషోత్తంబాబు, కార్యాలయ పర్యవేక్షకులు ఆదినారాయణ, సరళకుమారి, తదితరులు పాల్గొన్నారు.

'అనంత'లో కర్నాటక బ్యాంకు మరో శాఖ



వాక్ చేస్తున్న కర్నాటక బ్యాంకు సిబ్బంది

అనంతపురం : కర్నాటక బ్యాంకు అనంతపురంలో మరో శాఖను ఏర్పాటు చేసినట్లు బ్యాంకు ఎజిఎం శేషాద్రి తెలిపారు. ఈమేరకు బుధవారం నగరంలో బ్యాంకు సిబ్బంది వాక్‌థాన్ నిర్వహించారు. నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో ఉన్న కర్నాటక బ్యాంకు నుంచి ప్రారంభమైన నడక టవర్‌క్లాక్ మీదుగా కళ్యాణదుర్గం రోడ్డులో నూతనంగా ప్రారంభమైన బ్రాంచి వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్ కృష్ణకిషోర్, అనంతపురం క్లస్టర్ హెడ్ కార్తీక, నూతన బ్రాంచి మేనేజర్ చేతన్ సహా జిల్లాలో పని చేస్తున్న బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అల్లుడి చేతిలో మామ దారుణహత్య

అనంతపురం క్రైం : అల్లుడి చేతిలో మామ దారుణహత్యకు గురైన సంఘటన రూరల్ పరిధిలోని కక్కలపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కక్కలపల్లికి చెందిన సర్దార్‌వలి (45) ఓ బుక్‌స్టాల్‌లో వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. ఓ ప్రమాదంలో కాలు విరిగిన సందర్భంగా నెలరోజులుగా ఇంట్లోనే ఉంటున్నాడు. ఇతనికి ఒకే కుమార్తె షాకీరా ఉంది. ఆమెను అనంతపురం నగరానికి చెందిన జాఫర్ వలీకి ఇచ్చి వివాహం జరిపించారు. అయితే ఇటీవల సర్దార్ వలి తన ఇంటిని అమ్మాడు. ఆ డబ్బు విషయమై మామా అల్లుళ్ల మధ్య పలుమార్లు వాదోపవాదాలు జరిగాయి. రెండు రోజుల క్రితం సర్దార్ వలి అల్లుడు పనిచేస్తున్న షాపు వద్దకు వెళ్ళి దూషించాడు. దీన్ని మనసులో ఉంచుకున్న జాఫర్ వలి బుధవారం మధ్యాహ్నం కక్కలపల్లికి వచ్చాడు. షాపు వద్దకు వచ్చి తన మామతో వాదనకు దిగాడు. మాటామాటా పెరిగి కత్తితో ఇష్టానుసారం పొడిచాడు. దీంతో కడుపులో నుంచి పేగులు బయటకు వచ్చాయి. తప్పించుకోవాలని సర్దార్ వలి పక్కింట్లో కి పరుగెత్తినప్పటికీ వెంటాడి మరీ పొడిచాడు. దీంతో సర్దార్ వలి అక్కడికక్కడే మతిచెందాడు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై రూరల్ సీఐ ని వివరణ కోరగా భార్య ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి



మృతిచెందిన నరసింహులు

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలికి చెందిన 8మంది కూలీలు అనంతపురంలో పని నిమిత్తం టమోటా మార్కెట్‌కు వెళ్లేందుకు ఆటోలో బయలుదేరారు. ఆటో కొత్తపేట గ్రామ సమీపంలోని 44వ జాతీయ రహదారి వంతెనపై వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నరసింహులు (37) తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అతడు అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. మృతుడికి భార్య కీర్తి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామ సమీపంలో తాడిపత్రి-ధర్మవరం రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. నార్పల నుంచి ధర్మవరం వైపు వెళ్తున్న ఆటోకు బొందలవాడ సమీపంలోకి రాగానే పొట్టేళ్లు అడ్డు రావడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో రంగాపురానికి చెందిన ఇద్దరు, మారాల గ్రామానికి చెందిన ఒక్కరు, బండ్లపల్లి గ్రామానికి చెందిన ఒక్కరు గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నార్పల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి గ్రామసభలు

నార్పల : మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభల్లో 2024-25 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద చేయాల్సిన పనులను గుర్తించేందుకు సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున రైతులు, ఉపాధి హామీ కూలీలు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్థానిక సంస్థలకు నిధుల విడుదలపై హర్షం

శింగనమల : 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1452 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడం పట్ల పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇందులో స్థానిక సంస్థలకు రూ.998 కోట్లు, అర్బన్ పరిధిలో రూ.454 కోట్లు విడుదల చేసినందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పంచాయతీరాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు వైవిబి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం

శింగనమల : మండల కేంద్రానికి చెందిన టిడిపి కార్యకర్త గాజుల దాదు భార్య అనారోగ్యంతో మృతిచెందడంతో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు బుధవారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.ఆదినారాయణ, కాయల సురేష్‌యాదవ్, బాబావలి, కాయల శివశంకర్, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

23న ధర్నాకు మద్దతివ్వండి : సిపిఎం

గుంతకల్లు : రైల్వే పరిసర ప్రాంతాల్లోకి ప్రజలు ప్రవేశించకుండా రహదారిపై అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 23న డిఆర్ఎం కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సిపిఎం నాయకులు, ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులను పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సాయిబాబా, మురళీకృష్ణతో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నాయకులు స్పందిస్తూ ధర్నాకు మద్దతు ఇవ్వడమే కాకుండా ప్రత్యక్షంగా పాల్గొంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, కమిటీ సభ్యులు సురేంద్ర, రాము, షాషా, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల సిఐగా కౌలుకుంట్లయ్య



శింగనమల : మండల కేంద్రంలోని సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కార్యాలయంలో సీఐ కౌలుకుంట్లయ్య బుధవారం బాధ్యతలు పెట్టారు. ఈ సందర్భంగా నార్పల ఎస్ఐ రాజశేఖర్‌తోపాటు శింగనమల పోలీస్‌స్టేషన్ సిబ్బంది శాలువా కప్పి పుష్పగుచ్చాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఎక్కడైనా కోడి పందేలు, మట్కా, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌బాబు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సేవాఘడ్‌ను దర్శించుకున్న రైల్వే పిసిఓఎం

గుత్తి : మండలంలోని చెర్లోపల్లి గ్రామ సమీపంలోని సేవాఘడ్‌లో ఉన్న బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ ఆలయాన్ని రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్ బి.నాగ్యానాయక్ బుధవారం దర్శించుకున్నారు. ఇందులో భాగంగా సతీసమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జగన్మాత ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డివోఎం శ్రావణ్, సీనియర్ డిపిఓ జయశంకర్ చౌహాన్, సంత్ సేవాలాల్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యుడు భూక్యా వెంకటరమణ, రూపానాయక్, రైల్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన క్షేత్రాలను సందర్శించిన శాస్త్రవేత్తలు

గుత్తి : మండలంలోని వన్నెదొడ్డి, బాచుపల్లి, కరిడికొండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలను బుధవారం రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు సందర్శించారు. అఖిలభారత సమన్వయ మెట్ట వ్యవసాయ పరిశోధన పథకంలో భాగంగా ఏర్పాటైన క్షేత్రాలను పరిశీలించారు. ఇందులో భాగంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పంటల స్థితిగతులను పరిశీలించి యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు శాస్త్రవేత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కె.లక్ష్మణ్, ఐ.భాస్కరరావు, ఎన్.రమేష్ నాయక్, ఏడిఏ ఎం.వెంకటరాముడు, ఏఓ మెహరున్నీషా బేగం, బిహెచ్ఎ అజయ్, ఎంపిఈఓ మెర్సీ జోసెఫిన్, తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు

అనంతపురం క్రైం : భారత్ బంద్ సందర్భంగా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుకు వ్యతిరేకంగా భారత్ బందుకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రద్దీ ప్రాంతాలు, కూడళ్లలో ప్రత్యేక పోలీసు బృందాలతో సంచరిస్తూ అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకున్నారు.

అధికారుల సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రాథమిక సహకార సంఘం రికార్డుల కంప్యూటరైజేషన్‌కు సంబంధించిన సమాచార సేకరణ, తదితర అంశాలపై ఎంపిడిఒ యోగానందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా తహశీల్దార్ శేషారెడ్డి, మండల అగ్రికల్చర్ అధికారి కాత్యాయని వివిధ శాఖల విభాగాల అధికారులను మండలంలో నిర్వహించే పనులపై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

వజ్రకరూరు : ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని గిరిజన ఐక్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మూడ్ కేసవనాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ప్రత్యేకంగా నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులు డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసి ఉద్యోగావకాశాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం కూలి పనుల నిమిత్తం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారన్నారు. కావున వెంటనే బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : ఎంపిపి

వజ్రకరూరు : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, జడ్పిటిసి హనుమంతు హెచ్చరించారు. బుధవారం విడపనకల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన, ఎంపిడిఒ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీతాబాయి, మండల పరిషత్ ఏఓ భాస్కర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.